

సివిల్స్ సాధకులు

చిల్లకూరు ఇంజనీరుకు 558వ ర్యాంకు



సాయితేజ

చిల్లకూరు, ఏప్రిల్ 16 : చిల్లకూరు ఇంజనీరు సివిల్స్‌లో 558వ ర్యాంకు సాధించారు. చిల్లకూరు టీచర్స్ కాలనీలో నివాసముంటున్న నెల్లూరు శ్రీనివాసులు చిల్లకూరు మండలంలోని గుమళ్ల దిబ్బ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.ఆయన భార్య సరస్వతి ఓజిలి మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్‌సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. వీరి కుమారుడు సాయి తేజ తాజాగా విడుదలైన సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించారు. హైదరాబాదులోని బీహెచ్ఈఎల్ కంపెనీలో సాయితేజ 8 ఏళ్ల నుంచి సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా ఆయన భార్య జ్యోతి హైదరాబాదులోని పీడబ్ల్యూసీ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు.



తల్లిదండ్రులు, భార్యతో సాయితేజ

ఐఎఫ్ఎస్ నా లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగులైన మా అమ్మానాన్న చిన్నప్పట్నుంచీ పేదలకు సేవ చేయాలని, అందుకు సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించాలని చెబుతూవచ్చిన మాటలు నా మనసులో నాటుకుపోయాయి. పదవ తరగతి వరకు చిల్లకూరులోని ఎల్ఎపీ పాఠశాలలో చదివా. విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్, హైదారాబాదులోని ఐఐటీలో ఈసీఈ పూర్తిచేశా. గేట్‌లో ఎంపిక కావడంతో 2016లో హైదరాబాదులోని బీహెచ్ఈఎల్‌లో ఇంజనీరుగా చేరా. ప్రస్తుతం అదే కంపెనీలో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా.సివిల్స్‌లో ర్యాంకు సాధించాలన్న పట్టుదలతో ఉద్యోగం చేస్తూనే ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా చదివి పరీక్షలు రాశా.నాల్గసారి పరీక్షలకు హాజరైన నాకు సివిల్స్‌లో 558వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.అయితే ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు ఎంపిక కావడమే నా లక్ష్యం.

భీమ్‌నగర్‌వాసికి 810వ ర్యాంకు



ధనంజయకుమార్

కల్లూరు, ఏప్రిల్ 16 : పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి భీమ్‌నగర్‌కు చెందిన వి.ధనంజయకుమార్ సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.కృష్ణయ్య, ముత్యాలమ్మ దంపతుల కుమారుడైన ధనంజయకుమార్ ప్రస్తుతం కడపలోని ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.తమ్ముడు వేణుగోపాల్ కల్లూరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.పులిచెర్ల మండలంలోని కల్లూరు శారదా విద్యామందిర్‌లో 5వ తరగతి వరకు చదువుకున్న ధనంజయకుమార్ మదనపల్లె సమీపంలోని వలసపల్లి జవహర్ నవోదయలో 6నుంచి ఇంటర్ వరకు చదువుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాలలో ఈఈఈ గ్రూపులో బీటెక్ పూర్తిచేశారు. 2011వ సంవత్సరంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో మేనేజర్‌గా చేరి సుమారు ఏడేళ్ల పాటు పనిచేశారు. 2016వ సంవత్సరంలో గ్రూప్-1 పరీక్ష రాసి 2018లో ఎక్సైజ్‌శాఖలో సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించారు. మొదట అనంతపురంలో పనిచేసి ప్రస్తుతం కడపలో పనిచేస్తున్నారు.ఉద్యోగం చేస్తూనే కోచింగ్ తీసుకోకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేరయ్యారు.తాజాగా విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.



తమ్ముడు వేణుగోపాల్ , తల్లి ముత్యాలమ్మ, భార్య నిరూపతో ధనంజయకుమార్

అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళతా

ఐఏఎస్ సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నా. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళతా. పేద విద్యార్థులను విద్యాపరంగా ఆదుకోవాలనుకుంటున్నా.

ఖాట్మండు వర్సిటీతో పద్మావతి వర్సిటీ ఎంవోయూ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16: నేపాల్‌లోని ఖాట్మండు యూనివర్సిటీతో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం చేసుకుంది. హైదరాబాదులో ఈ నెల 15 నుంచీ నిర్వహించిన వైస్ ఛాన్స్‌లర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ ఒప్పందం కుదిరింది.ఖాట్మండు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బోలా తప, మహిళాయూనివర్సిటీ వీసీ భారతి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఒప్పందంలో భాగంగా స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్‌తో పాటు రీసెర్చ్ కొలాబరేషన్, డ్యూయెల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ చేయనున్నట్లు పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి వెల్లడించారు.రెండేళ్ళ పాటు ఈ ఒప్పంద కాల పరిమితి అని ఆమె తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలను పూర్తి చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని అన్నారు.

శేషాచల అడవుల్లో మంటలు



తిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం మంటలు రేగాయి. తిరుమలకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం, మొదటి ఘాట్‌రోడ్డుకు సమీపంలో వున్న సానరాళ్లమిట్ట వద్ద అడవికి నిప్పంటుకుంది.ఎండ తీవ్రతకు చెట్లు బాగా ఎండిపోయి వున్న క్రమంలో మంటలు వేగంగా వ్యాపించాయి.అటవీశాఖ, టీటీడీ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది మంగళవారం రాత్రి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలు తిరుమల దిశగా రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు అడవిలో మంటలను ఆశ్చర్యంగా చూశారు.



ముక్కంటి సేవలో పీవీ సింధు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ముక్కంటీశుడిని దర్శించుకున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం మృత్యుంజయ మూర్తి సన్నిధిలో సింధూను వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరి యాదవ్, సీఎస్వో నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కుమార్ రెడ్డిని ఓడించేంతవరకు నిద్రపోను

● ఆనం రామనారాయణరెడ్డి



టీడీపీలోకి ఆనం అనుచరులకు ఆహ్వానం



మాజీ మంత్రి ఆనంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 16: భూమిపైన ఉన్న ఎర్రచందనం, ఇసుక, సిలికా, గంజాయితో పాటు భూమి లోపల వున్న మైకా, క్వార్ట్జ్ దోచుకొన్న వైసీపీ నేతలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని ఎస్ఆర్ఎల్ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీలో చేరారు. సైదాపురం, రాపూరు, కలువాయి, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాలకు చెందిన వారికి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.వీరిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, ఏఎంసీ ఛైర్మన్లు, వైసీపీలో పలు కీలక పదవుల్లో వున్న నేతలు వుండడంతో టీడీపీలో జోష్ నెలకొంది.ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్,తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ నానాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో ఇప్పటివరకు పట్టుబడ్డ డబ్బంతా వైసీపీ వాళ్లదేనని తేలిందన్నారు.వెంకటగిరి వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని ఓడించేవరకు తాను నిద్రపోనని హెచ్చరించారు.ప్యాకేజీ తీసుకొని అసమ్మతి నేతలను టీడీపీలో చేర్పానంటూ చెబుతున్న ఆయన ఏ ప్యాకేజి జగన్‌కు ఇచ్చి జిల్లా ఇన్‌చార్జి పదవి, వెంకటగిరి టికెట్ తెచ్చుకున్నారో చెప్పాలన్నారు.ఐదేళ్ళ వైసీపీ దుర్మార్గపు పాలనలో ఎర్రచందనం, ఇసుక, మట్టి అక్రమ మైనింగ్, గంజాయి అక్రమ రవాణా మొత్తం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిధున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో నడిచాయని ఆరోపించారు.రాష్ట్రంలో కాంట్రాక్టు పనులు దక్కించుకోవాలంటే ఎవరైనా ఈ ఐదుగురికి కమీషన్లు ఇస్తేనే పని జరిగిందన్నారు.ఈ దోపిడీ సొమ్ములో చాలాభాగం తాడేపల్లి ప్యాలెస్‌కే చేరిందన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 16: జిల్లాలోని పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యవహారాల పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది.తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు కర్ణాటకకు చెందిన కరీ గౌడను నియమించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు కర్ణాటకకే చెందిన ఉజ్వల్‌కుమార్ ఘోష్‌ను నియమించారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని చంద్రగిరి, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు కైలాష్ వాంఖేడ్‌ను నియమించారు. వీరు ఈనెల 25 నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు.

పోలీసు అబ్జర్వర్లుగా... : శాంతిభద్రతల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం పోలీసు అబ్జర్వర్లను నియమించింది. మహారాష్ట్రకు చెందిన అరవింద్ సాల్వే చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, గంగాధర నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు. ఈయన ఈనెల 25 నుంచి విధుల్లో ఉంటారు.

అభ్యర్థుల ఖర్చుల పర్యవేణకు.. : అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణకు ఐఆర్ఎస్ అధికారి ప్రదీప్ కుమార్‌ను నియమించారు. ఈయన తిరుపతి పార్లమెంట్ పరిధిలో బాధ్యతలు చూస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మీనూవాలాను గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరికి,విజయ్‌శేషాద్రిని చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడుకు నియమించారు. వీరు గురువారం నుంచీ బాధ్యతలు చేపట్టనున్నారు. అభ్యర్థులు, ఓటర్లు ఏవైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే వీరికి చేయవచ్చు.

సార్వత్రిక ఎన్నికలకు రేపే నోటిఫికేషన్

● నామినేషన్లకు అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి



వెంకటగిరిలో నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16:సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు.గురువారం నుంచి 25వ తేదీ వరకు సెలవు దినాలు మినహాయించి మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ తరువాత బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటించనున్నారు. కాగా నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నిబంధనలను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరించారు.అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, నామినేషన్ల దాఖలు సమయంలో వంద మీటర్ల పరిధిలో గరిష్ఠంగా 3 వాహనాలకు అనుమతి,ఐదుగురు వ్యక్తులు(అభ్యర్థి సహా) ఆర్వో కార్యాలయానికి రావొచ్చని సూచించారు.

పోస్టల్ ద్వారా ఎపిక్ కార్డుల అందజేత

● దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16: ఎపిక్ కార్డులను పోస్టల్‌శాఖ ద్వారా ఓటర్లకు పంపడం జరుగుతుందని ఒకవేళ తిరిగి వచ్చిన వాటిని సంబంధిత బీఎల్వోల ద్వారా మాత్రమే పంపిణీ చేయబడతాయని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.జిల్లాలో 2023 జనవరి 6వ తేదీ నుంచి 2024 మార్చి 30వ తేదీ వరకు మొత్తం 3,37,130 ఓటరు ఎపిక్ కార్డులను తయారు చేసినట్లు తెలిపారు. అందులో 3,14,710 ఎపిక్‌కార్డులను ప్రింట్ చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. కలెక్టరేట్ నుంచి పోస్టల్ శాఖ ద్వారా 2,65,823 ఎపిక్‌కార్డులను ఓటర్లకు పంపడం జరిగిందన్నారు.వాటిలో 12,875 ఎపిక్ కార్డులు వెనక్కు వచ్చినట్లు తెలిపారు. బీఎల్వోల ద్వారా 10,439 ఓటరుకార్డులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా పంపిణీకి 2,436 ఓటరు కార్డులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ఉన్నత స్థాయికి చేరాలంటే ఇష్టంతో కష్టపడాలి


ప్రతిభ అవార్డు అందుకుంటున్న శిరీష

పాకాల, ఏప్రిల్ 16: ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్ఎస్ మోహన్ నాయుడు, డాక్టర్ ఎస్.దామోదరనాయుడులు మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించేతత్వాన్ని అలవరచుకోవాలన్నారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పట్టణ ప్రముఖులు ఆర్వీ ప్రసాద్, నారాయణరావు, అధ్యాపకులు సురేంద్ర, రమేష్ కుమార్, మాశిలామణి, చిట్టికళావతి, మోహన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

పాకాల, ఏప్రిల్ 16: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక కేంద్ర అధికారి గుణశేఖర్‌రెడ్డి కోరారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్వీఎన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినపుడు నష్టం జరగకుండా ఎలా నివారించాలో ప్రదర్శించారు. ఎంఈవో బాబ్జీ, అగ్నిమాపక సిబ్బంది విశ్వనాథం, ఆనందనాయుడు, భాస్కర్, రామకృష్ణ, నాగార్జున, సురేంద్రబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా లలితా హోమం


భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న రమ్యానంద భారతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 16: వసంత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో మంగళవారం వైభవంగా లలితా హోమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మరకట శక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేట్టారు. ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా లలితా హోమం ప్రారంభించారు. మధ్యాహ్నం కుర్తాళంపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి హోమంతో పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ అనంతరం వీరు భక్తులకు దేవీ వైభవాన్ని వివరించి అనుగ్రహభాషణం చేశారు.

రామాపురంలో ఓటు హక్కుపై అవగాహన

రామచంద్రాపురం, ఏప్రిల్ 16: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోంచుకోవాలని ఆర్ఐ కృష్ణమ్మ కోరారు. రామాపురం వద్ద మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిగువ రామాపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు ప్రాధాన్యత, వినియోగం గురించి అవగాహన కల్పించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

రామచంద్రాపురం, ఏప్రిల్ 16: నెత్తకుప్పం, వేపకుప్పం, అనుపల్లి గ్రామాల్లో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. 70మంది పారామిలిటరీ, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చంద్రగిరి, ఏప్రిల్ 16: ఆగి ఉన్న కళాశాల బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. మంగళవారం ఉదయం తిరుపతి నుంచి పుంగనూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు చంద్రగిరి కొత్తపేట బస్సు స్టాప్ వద్ద ఆగివున్న ఓ ప్రయివేటు కళాశాల బస్సును ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చంద్రగిరి ఏరియా ఆసుపత్రి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజీనామాకు వలంటీర్లపై చెవిరెడ్డి ఒత్తిడి: టీడీపీ


ఇంటింటి ప్రచారంలో పులివర్తి వినీల్

తిరుపతిరూరల్, ఏప్రిల్ 16: వలంటీర్ల సహకారం లేకుండా ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లలేమని ఎమ్మెల్యే చెవిరెడ్డి భావించి బలవంతంగా వారితో రాజీనామాలు చేయిస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీలో మంగళవారం మీఇంటి వద్దకు మీపులివర్తినాని, బాబు షూరిటీ-భవిష్యత్‌కి గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వినీల్‌కు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

సంక్షేమం కోసం జనతా కాంగ్రెస్‌ను గెలిపించండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్16: రాష్ట్రంలో సంక్షేమ పాలన కోసం ప్రజలు జనతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.ఉమాదేవిని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మెహతాబ్‌రాయ్ విజ్ఞప్తిచేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ నుంచి ఉమాదేవి చంద్రగిరి అసెంబ్లీ, తిరుపతి పార్లమెంట్ స్థానాలకు పోటీచేస్తారని ఆయన ప్రకటించారు. అఁంతరం ఆమెకు బీ-ఫామ్ ఈ సమావేశంలో నాయకులు ఎ.మోహన్ రూప, తులసీకుమార్, ఎం.చెంగలరాయులు, జయశంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్షురకులకు రూ.20 వేల వేతనం ఇవ్వాలి

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్16: తిరుమలలో పీస్ రేట్ పద్ధతిలో పనిచేస్తున్న 830 మంది క్షురకులకు టీటీడీ ఛైర్మన్ ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు వేతనాలు ఇవ్వాలని టీటీడీ మహిళా క్షురకుల వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.రాధాదేవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

రామకృష్ణాశ్రమంలో నేడు నవమి వేడుకలు

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 16: తిరుపతి శ్రీరామకృష్ణాశ్రమంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం 5 గంటలకు సంగీత ఉపాధ్యాయులు కణితి సోమేశ్వరి రామకీర్తనలు ఆలపిస్తారు. 6 గంటలకు బేలూరు మఠం, కోల్‌కతాకు చెందిన స్వామి శశికంఠానంద నవమి విశేషాలపై ప్రసంగిస్తారు. అనంతరం 6.30 నుంచి 8 గంటల వరకు హారతి, సంకీర్తనా గానం ఉంటుంది.

కూటమి అభ్యర్థి ఆరణిని గెలిపించండి



తిరుపతి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి) : జరగబోయే ఎన్నికల్లో ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కోవాలని గాజు గ్లాసు గుర్తుపై ఓటువేసి కూటమి అభ్యర్థిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసంలో 11వ డివిజన్ నుంచి 20వ డివిజన్లకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణ, పోల్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు.

'ద్రావిడ'లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య ఘర్షణ

గుడుపల్లె, ఏప్రిల్ 16: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. దీనిపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కొన్ని నెలలుగా అధికారులు.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదని అందరూ కలిసి పరిపాలన భవనం ఎదుట నిరసన తెలపడానికి పూనుకున్నారు. అయితే కొంతమంది నిరసనకు వెనకడుగు వేశారు. మంగళవారం భాషా భవనంలోని పలు విభాగాల్లో కొంతమంది ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఆ విషయం తెలుసుకున్న ఉద్యోగులు కొందరు విధులకు హాజరైన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘర్షణకు దిగారు. ఆ తర్వాత గుడుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసుకున్నారు.

ముళ్ల పొదల్లో యువతి మృతదేహం



చంద్రగిరి, ఏప్రిల్ 16: చంద్రగిరి మండల పరిధిలోని తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారిలో కేఎంఎం కళాశాల వెనుక భాగాన రైల్వే ట్రాక్ సమీపంలోని ముళ్ల పొదల్లో గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని గుర్తించారు. 30 సంవత్సరాల వయసుంటుందని భావిస్తున్నారు. మంగళవారం స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం ఉబ్బి దుర్వాసన వెదజల్లుతోంది. పోస్టుమార్టం కోసం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతదేహం వద్ద ఆధారాలు లభించలేదు. హత్య చేశారా, లేక ఆత్మహత్య చేసుకుందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ అరాచకాలపై టీడీపీ శాంతియుత ర్యాలీ



చంద్రగిరిలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న పులివర్తి నాని

- రౌడీయిజం, దౌర్జన్యాలను తరిమి కొట్టాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పిలుపు

చంద్రగిరి, ఏప్రిల్ 16: చంద్రగిరి నియోజకవర్గంలో రౌడీయిజం, దౌర్జన్యాలను తరిమి కొట్టాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి జాతీయ రహదారి వరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో భారీగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. సైకో పాలన పోవాలి, సైకిల్ పాలన రావాలి, గంజాయి భూతాన్ని తరిమి చంద్రగిరి అభివృద్ధికి దోహదపడదాం, రౌడీ రాజ్యం నశించాలంటూ నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ ముందెన్నడూ లేనివిధంగా డ్రగ్స్, గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలకు యువకులు బానిసలవుతూ అసాంఘిక కార్యక్రమాల్లో భాగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులపై గొంతెత్తితే అణచివేత, మాట వినకుంటే అక్రమ కేసుల నమోదు వంటి అరాచకాలకు అధికార పార్టీ నాయకులు పాల్పడుతున్నారన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు హేమాంబరధరరావు, సుబ్రమణ్యం నాయుడు, కుమారరాజారెడ్డి, శివకోటిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఏవీ రమణమూర్తి, ముడిపల్లి సురేష్‌రెడ్డి, పాకాల జడ్పీటీసీ నంగాపద్మజా రెడ్డి పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేద్దాం: వరప్రసాద్


బీజేపీ నాయకులతో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

తిరుపతి,(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 16: కేంద్రంలో మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు కోరారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి, నియోజకవర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షుల సమావేశం రాష్ట్ర ఎన్నికల కోఆర్డినేటర్ శేఖర్‌జీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి జరగాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, పామాంజి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, లీగల్‌సెల్ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రప్ప, వరప్రసాద్, నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, వినీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌ను ఆయన నివాసంలో వరప్రసాదరావు కలుసుకున్నారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు అందరూ సహకరించాలని కలసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను నియమించడం సంతోషకరమన్నారు.

వైసీపీ పతనం ఖాయమైంది

వెంకటగిరి: అరాచక వైసీపీ ప్రభుత్వం పతనం అంచున ఉందని, రాబోయేది ఉమ్మడి ఎన్డీఏ ప్రభుత్వమని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థుల సమన్వయ కమిటీ సమావేశం మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూత్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి ఆనం, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ, వరప్రసాదరావును సత్కరిస్తున్న నాయకులు

సంస్కృత వర్సిటీలో ముగిసిన సదస్సు


సదస్సులో ప్రొఫెసర్ రామసూర్యనారాయణ, తదితరులు

తిరుపతిరూరల్, ఏప్రిల్ 16: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో శ్రీమద్రామయణంలోని భారతీయ జ్ఞానపరంపర అనే అంశంపై రెండ్రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ మాట్లాడుతూ రామనామమే సర్వమానవాళికి శుభప్రదమన్నారు. కర్ణాటక సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కేఈ దేవనాథన్ మాట్లాడుతూ రామాయణంలో అనేక విజ్ఞాన అంశాలతోపాటు జీవితానికి అవసరమైన అనేక మార్గాలున్నాయన్నారు.. స్విమ్స్ వైద్యులు డాక్టర్ అల్లాడి మోహన్, వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్‌డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, ప్రొఫెసర్ లలితారాణి, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రాజగోపాలన్, ప్రొఫెసర్ రంగనాథన్, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

'చంద్రగిరిని చెరబట్టిన ఘనత చెవిరెడ్డిదే'


పులివర్తి సుధారెడ్డి

తిరుపతిరూరల్, ఏప్రిల్16 అభివృద్ధిలో నియోజకవర్గాన్ని 20ఏళ్ల వెనక్కినెట్టి చంద్రగిరిని చెరబట్టిన ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఘనత సొంతం చేసుకున్నారని టీడీపీ మహిళానేత పులివర్తి సుధారెడ్డి విమర్శించారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో మంగళవారం మహిళలతో కలసి 'మహిళాశక్తి అండగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పాలకులు సహజసంపదని కొల్లగొట్టి, మఠం భూములను మాయం చేశారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వార్డు సభ్యులను దూరంపెట్టి అరాచకపాలన సాగించారని విమర్శించారు. ఇప్పుడు ఓటమి భయంతోనే ఒంగోలుకి మకాం మార్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతిసమస్యకూ పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

రుయా డ్రైవర్లపై దయ లేదా ?

- ఒక్కో డ్రైవరు 12 గంటలు పనిచేయాలంటూ ఆదేశాలు
- ఖాళీ పోస్టులను భర్తీ చేయకే సమస్య


రోగులను తీసుకువెళుతున్న అంబులెన్సు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 16: రుయాస్పత్రిలో వాహన డ్రైవర్లు 12 గంటల పాటు పనిచేయాలని అధికారులు ఆదేశించడం విమర్శలకు దారితీస్తోంది. రోగులను వార్డులకు, వైద్య పరీక్షలకు తీసుకువెళ్లేందుకు ఆస్పత్రికి సంబంధించి ఉచిత అంబులెన్సులు, ఇతర వాహనాలు ఉన్నాయి.వీటిలో కొన్ని వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో ఉన్న ఒక్క అంబులెన్సులోనే రోగులను రాత్రీపగలు తేడా లేకుండా నిత్యం వార్డులకు, వైద్య పరీక్షలకు, ఓపీలకు తీసుకువెళుతుంటారు. ఇందుకు మొన్నటివరకు నలుగురు డ్రైవర్లు అందు బాటులో ఉండేవారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్ డ్రైవర్లు కాగా ఒకరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. వీరిలో అవుట్‌సోర్సింగ్ డ్రైవరును ఇటీవల తొలగించడంతో ఉన్న ముగ్గురు డ్రైవర్లే రోజుకు మూడు షిఫ్టుల్లో సెలవు లేకుండా వాహనాలు నడుపుతున్నారు. ఈ క్రమంలో వారాంతపు సెలవు కాదు కదా కనీసం అత్యవసర సమయంలో కూడా సెలవు తీసుకునే పరిస్థితి లేదు. ఇలా నిరంతరం పనిచేయాలంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మరో డ్రైవర్‌ను నియమించాలని డ్రైవర్లు నెలరోజులుగా అధికారులకు విన్నవించుకుంటున్నా వారు పట్టించుకోవడం లేదు.వీరిలో ఒకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మిగిలిన ఇద్దరు డ్రైవర్లను రోజుకు 12 గంటలు పనిచేయాలని అధికారులు సూచించారు.ఇందుకు వారు అంగీకరించకపోవడంతో తాజాగా 12 గంటలు పనిచేయాల్సిందే అంటూ సీఎస్ఆర్ఎంవో ఆదేశాలు జారీ చేశారు. వాహనాలు నడిపే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరుగుతాయని అధికారులు అర్థం చేసుకోవాలని డ్రైవర్లు కోరుతున్నారు. జిల్లా అధికారులు పరిశీలించి ఖాళీగా ఉన్న డ్రైవర్ల నియామకాలను తక్షణమే చెపట్టాలని అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా అదనపు డ్రైవర్లను నియమించాలని కోరుతున్నారు.

మేమే రోగులుగా మారుతున్నాం

- రోజుకి 12 గంటలపాటు నెలలో ఒక్కరోజు కూడా సెలవు లేకుండా వాహనాలు నడిపితే ఆరోగ్యం దెబ్బతిని ఇదే ఆస్పత్రిలో రోగులుగా చేరాల్సిన పరిస్థితి ఉంది. డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలి. జిల్లా అధికారులు మా ఆవేదన అర్థం చేసుకోవాలి.

\- ఈశ్వరయ్య, ప్రభుత్వ సీనియర్ డ్రైవర్

కోదండ రామయ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి, ఏప్రిల్ 16: చంద్రగిరిలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం నుంచి జరుగనున్న బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణలో భాగంగా సేనాధిపతి ఉత్సవం, మృత్సంగ్రహణం, మేదినిపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ అధికారులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం నుంచి రాత్రి 7.30 గంటల వరకు హనుమంతు వాహనంపై కోదండరామస్వామి దర్శనమివ్వనున్నారు. 23న కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. 25న చక్రతాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 26న శ్రీరామపట్టాభిషేకం నిర్వహించనున్నారు.

నేడు శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

శ్రీరామపట్టాభిషేకం రేపు

తిరుమల ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శ్రీరామనవమి ఆస్థానం ఘనంగా జరుగనుంది. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీరాముడు హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు.ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహన సేవ జరుగుతుంది. ఆ తర్వాత రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.అలాగే శ్రీవారి ఆలయంలో గురువారం శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద ఆలయ అర్చకులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

నా భర్తను రిలీవ్ చేయండి

- కలెక్టర్‌ని కోరిన జడ్పీ నోడల్ అధికారి బాలాజి సతీమణి!

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 16: తన భర్తను జిల్లా నుంచి రిలీవ్ చేయాల్సిందిగా జడ్పీ నోడల్ అధికారిగా పనిచేస్తున్న ఎంపీడీవో బాలాజి సతీమణి సోమవారం కలెక్టర్‌ను కలిసి కోరినట్లు సమాచారం. జడ్పీ సమావేశ మందిరం నిర్మాణ విషయమై విచారణ జరుగుతోంది. ఇందులో బాలాజీకి సంబంధం లేకున్నా జడ్పీ పూర్వ అధికారికి నమ్మిన వ్యక్తి అనే కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల బైరెడ్డిపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేష్ పలమనేరులోని బాలాజి ఇంట్లో అనధికారికంగా సోదాలు చేసి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. దీనిపై కలెక్టర్ షన్మోహన్ ఆగ్రహించి.. రాజేష్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బాలాజి సతీమణి భయపడి తన భర్తను రిలీవ్ చేయాలని కలెక్టర్‌ని కలిసి వేడుకున్నట్లు సమాచారం. అయితే దీనిపై కలెక్టర్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కాగా.. ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీవో అయిన బాలాజీని నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. అయితే ఆయన్ను ఇంతవరకు జిల్లా నుంచి రిలీవ్ చేయలేదు. దీనిపై ఆమధ్య నెల్లూరు జిల్లా టీడీపీ నేత సోమిరెడ్డి ఎన్నికల కమిషన్‌కి కూడా ఫిర్యాదు చేశారు.

విచారణ పూర్తి

జడ్పీ సమావేశ మందిరం నిర్మాణ విషయమై జరుగుతున్న విచారణ మంగళవారం పూర్తయ్యింది. నివేదికను పంచాయతీరాజ్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు విచారణ అధికారి జేసీ శ్రీనివాసులు అందించనున్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

చిల్లకూరు, ఏప్రిల్ 16: చిల్లకూరు మండలంలోని గుత్తావారిపాళెం గ్రామ సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.... మండలంలోని గుత్తావారిపాళెం సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో రామసుబ్బయ్య(60) వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. అదేతోటలో బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య నాగమ్మ పనిలో చేరారు. కొంతకాలం తరువాత పనిమానేసి వెళ్లిపోవాలని, లేకపోతే చంపుతానని రామసుబ్బయ్యను వెంకటేశ్వర్లు బెదిరించేవాడు. 13 జూలై 2021న రామసుబ్బయ్య రక్తపుమడుగులో పడి తీవ్రగాయాలతో పడి ఉండడాన్ని అదే తోటలో పని చేస్తున్న ఆవుల కాపరైన బాలయ్య గమనించాడు. వెంటనే రామసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు సమాచారం అందించాడు. అలాగే 108 వాహనంలో రామసుబ్బయ్యను నెల్లూరుకు, అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రామసుబ్బయ్య మృతిచెందాడు. అయన కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తోటలో పనిచేస్తున్న సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు విచారించిన గూడూరు కోర్టు ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి నిందితుడైన వెంకటేశ్వర్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

చెక్‌పోస్టులో ఎస్ఈబీ తనిఖీలు

తడ, ఏప్రిల్ 16: ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ అరుణ్‌కుమార్ తడ మండలంలోని బీవీపాళెం చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తడకు వచ్చిన ఆయన చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి, వాహన తనిఖీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఈబీ ఎతఈఎస్‌లు నరసింహరావు, రమేష్ తదితరులు ఉన్నారు.


నేడు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 16: చిత్తూరు డీఐ రోడ్డులోని రాజామహల్ హోటల్‌లో బుధవారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకులు డాక్టర్ కె.రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 2023వ సంవత్సరం కథలు, కథానికలు, అభ్యుదయ సాహిత్య పోటీల విజేతలకు నగదు పురస్కారం, సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. కళాకారులు, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బిల్లు లేకుండా తరలిస్తున్న రూ3.38 లక్షల సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16: ఎలాంటి బిల్లులు, రశీదులు లేకుండా అక్రమంగా తీసుకెళుతున్న రూ 3.38లక్షలను మంగళవారం ఈస్ట్ పోలీసులు సీజ్ చేశారు. తుడా రోడ్డులో ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కొర్లగుంటకు చెందిన ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఆపారు. అతడి బ్యాగులో ఉన్న రూ 3.38 లక్షలు తీసుకుని సీజ్ చేశారు.

భూకబ్జాదారులకు గుణపాఠం చెపుతాం : బీసీవై


మాట్లాడుతున్న బీసీవై నాయకులు

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్16: తిరుపతిలో ఎమ్మెల్యే, ఆయన అనుచరుల భూకబ్జాలకు అడ్డుకట్ట వేస్తామని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) నాయకులు ఓంకార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ నుంచి ఎ.క్రిష్ణవేణియాదవ్ తిరుపతి ఎమ్మెల్యేగా పోటీచేస్తారని వెల్లడించారు. ఆమెను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి క్రిష్ణవేణి, మునిశేఖర్ యాదవ్, వైష్ణవి, జమున, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విశ్వంలో ఘనంగా శ్రీరామనవమి



తిరుపతి(విద్య), ఏప్రిల్ 16: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాల విద్యార్థులు శ్రీరామ నవమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా వేడుకలు చేసుకున్నారు. శ్రీరాముడు, సీత, భరత, హనుమంతుడి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్. విశ్వ నాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మన పండుగలు, సంప్రదాయాల గురించి తెలియ జేయాలని శ్రీరామనవమి వేడుకలను నిర్వహించినట్టు చెప్పారు. విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నిర్మూలనపై అవగాహన పెంచుకోండి

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 16: ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అలాగే ప్రమాదాల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుపతిలోని బాలాజీ కాలనీ మేఘన అపార్టుమెంట్ వాసులకు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా చూడండి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా సూక్ష్మ పరిశీలకులు గురుతర బాధ్యతను నిర్వహించాలని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు.ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో జిల్లాలోని ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ సజావుగా, స్వేచ్ఛగా సాగేందుకు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి ఆయా పోలింగ్ కేంద్రాల్లోని వాస్తవ పరిస్థితులను చేరవేయాలని కోరారు. గత ఎన్నికల్లో అనుభవం ఈ ఎన్నికల్లో చాలా ఉపయోగపడుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని ఓటింగ్ సరళిపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సమస్యలు ఏర్పడితే వెంటనే సెక్టోరియల్ అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు, సాధారణ ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్ళాలన్నారు.జిల్లా ఎన్నికల శిక్షణ నిపుణులు రామ్మోహన్, చెన్నయ్య, వివిధ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సుమారు 1200 మంది సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రచారంలో పోలీసు, సెబ్ బృందాలు

నియోజకవర్గానికి మూడు టీములు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16: ఎన్నికల నోటిఫికేషన్ రేపు విడుదల కానున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం నిఘా మరింత కట్టుదిట్టం చేసింది. ప్రతి నియోజకవర్గానికి మూడు ప్రత్యేక బృందాలను నియమించారు. అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెంచారు.ఎన్నికల నియమావళి ఉల్లంఘనలను పర్యవేక్షించడానికి ఎన్నికల సంఘంతో పాటు జిల్లా పోలీసు యంత్రాంగం సైతం ప్రత్యేక బృందాలను నియమించింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, వీడియో సర్వేలెన్సు, స్టాటిస్టిక్ సర్వేలెన్సు, వీడియో హర్యాయింగ్, మీడియా కోఆర్డినేషన్, అకౌంటింగ్ బృందాలను నియమించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ప్రతి బృందంలో ముఖ్య శాఖ అధికారి, పోలీసు అధికారి, వీడియోగ్రాఫర్ వుంటారు. ఓటర్లను మభ్యపెట్టడానికి డబ్బు, మద్యం పంపకాలను నియంత్రించేందుకు ఈ బృందం పనిచేస్తుంది.

స్టాటిస్టిక్ సర్వేలెన్సు బృందం

ఈ బృందంలో మొత్తం 7 నుంచి 8 మంది వుంటారు. ఈ బృందానికి డిప్యూటీ తహసిల్దార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. నలుగురు పోలీసు అధికారులు వుంటా రు. ఎక్సైజ్, వీడియోగ్రాఫర్ వుంటారు. ఒక నియోజకవర్గానికి మూడు బృందాలు వుంటాయి.

ప్రచార వివరాల సేకరణ

అభ్యర్థులు ప్రచారం చేసే సమయంలో ఎంతమంది కార్యకర్తలు పాల్గొంటున్నారు... వారి అవసరాలను అభ్యర్థులు ఏ మేరకు తీరుస్తున్నారో గోప్యంగా సేకరిస్తున్నారు. మద్యం సరఫరా చేస్తుంటే కేసులు నమోదు చేయడానికి పోలీసు, సెబ్ బృందాలు చర్యలు తీసుకుంటున్నాయి.

వీడియోల చిత్రీకరణ

వీడియో సర్వేలెన్సు బృందం ద్వారా వచ్చిన వీడియోలను నిశితంగా పరిశీలన చేస్తారు. నియోజకవర్గానికి ఒక బృందం వుంటుంది, ఇందులో ఒక గెజిటెడ్ స్థాయి అధికారి, ఇద్దరు సహాయకులు వుంటారు. ఎక్కడైనా అభ్యర్థులు ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే వీడియోలు తీసి ఎన్నికల సంఘానికి సమర్పిస్తారు.

మీడియా కోఆర్డినేషన్ : మీడియా కోఆర్డినేషన్ బృందం రోజూ దినపత్రికల్లో వచ్చే ప్రకటనలను పరిశీలిస్తుంది. పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురితమైతే వాటిని అభ్యర్థుల ఖర్చుల్లో లెక్కకడతారు. ఈ వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తారు. ప్రతి నియోజకవర్గానికీ ఒక అకౌంటింగ్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ట్రెజరీ అధికారి సభ్యుడిగా వుంటారు. ఇతర శాఖలకు చెందిన ఒకరు సహాయ అధికారిగా పనిచేస్తారు. అభ్యర్థుల ఖర్చులు రోజు వారీ లెక్క కట్టి అధికారులకు సమర్పిస్తారు.



గ్లాసు, కమలం మరింతగా ప్రజల్లోకి వెళ్లాలి

ఎన్నికల సన్నాహక సమావేశంలో కూటమి నాయకులు



తిరుపతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని, జనసేన పార్టీ గాజు గ్లాసు, బీజేపీ కమలం గుర్తులను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఇందుకోసం బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు కృషిచేయాలని కూటమి నేతలు స్పష్టంచేశారు. తిరుపతిలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకుల ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల సమన్వయకర్త పేరాల శేఖర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డా.పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, బీజేపీ నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. సోషల్ మీడియాలో అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థుల గుర్తులు అందరికీ తెలిసేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి శేఖర్‌రావు దిశానిర్దేశం చేసారు. ఉమ్మడి పార్టీలు క్షేత్ర స్థాయిలో బలంగా ఉన్నాయని, ప్రభుత్వం స్థాపించేందుకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. రాబోవు ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌లను గెలిపించి ఉమ్మడి అధినాయకులకు కానుకగా ఇద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊకా విజయ్‌కుమార్, మహేష్ యాదవ్, జనసేన నాయకులు కృష్ణయ్య, కీర్తన, ఆకుల వనజ, ఆనంద్, జయంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



టీడీఆర్ బాండ్లలో జరిగిన కోట్ల అవినీతిని నిగ్గుతేలుస్తాం

ఎన్‌డీఏ కూటమి నాయకుల హెచ్చరిక



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్16: తిరుపతిలో అధికార పార్టీకి చెందిన భూబకాసురులు రోడ్ల విస్తరణ పేరుతో టీడీఆర్ బాండ్ల రూపంలో కోట్ల రూపాయల దోపిడీ చేశారని ఆ వివరాలు బహిర్గతం చేసి నిజాలు నిగ్గు తేలుస్తామని ఎన్‌డీఏ కూటమి నాయకులు జి.భానుప్రకాష్ రెడ్డి, డాక్టర్ హరిప్రసాద్, జి.నరసింహ యాదవ్ హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రోడ్ల విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో జరిగిన భూసేకరణలో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. టీడీఆర్ బాండ్లను హోల్డ్‌లో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రోడ్లకోసం చేపట్టిన భూసేకరణలో 1013 మందికి టీడీఆర్ బాండ్లు ఇవ్వవలసి ఉండగా కేవలం 342 మందికి మాత్రమే ఇవ్వడంలో ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకే టీడీఆర్ బాండ్ల పంపిణీ జరిగి ఉంటుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాగానే భూములు పోగొట్టుకున్న వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మాస్టర్ ప్లాన్ రోడ్లపై బహిరంగ విచారణ జరిపించాలన్నారు. స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల్లో నిబంధనలు పాటించలేదన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనుల్లో జరిగిన అవకతవకలపై తాము బహిరంగ విచారణకు సిద్ధమని తెలిపారు.

20, 21తేదీల్లో ఆర్గానిక్ మేళా

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 16: తిరుపతిలోని మహతి వేదికలో ఈనెల 20, 21 తేదీల్లో ఆర్గానిక్ మేళా నిర్వహించనున్నట్లు కనెక్ట్ టు ఫార్మర్స్ సేవా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 20వ తేదీ శనివారం ఉదయం 10.30 కి కార్యక్రమం మొదలవుతుంది. 11 గంటలకు కషాయాల గంగిరెడ్డి కషాయాల తయారీపై శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జేఎస్ రెడ్డి దేశవాళి పూలమొక్కలు, పండ్ల మొక్కలు అంటుకట్టడంపై శిక్షణ ఇస్తారు. సాయంత్రం 5గంటలకు డాక్టర్ సింధు మలర్ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పిస్తారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు పండ్ల మొక్కల పెంపకంపై విజయరాం ప్రసంగం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు ప్రకృతి వనం ప్రసాద్ ప్రసంగం ఉంటుంది. స్టాల్ నమోదు కోసం 6303606326లో సంప్రదించవచ్చు.



వెంకన్న హుండీ ఆదాయం రూ.4.28 కోట్లు

తిరుమల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.28 కోట్ల ఆదాయం లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. ఇక సోమవారం 77,511 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,553 మంది తలనీలాలు సమర్పించారు. ఈ మేరకు టీటీడీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

శ్రీవారి సేవలో మాజీ న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత గర్భా లయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ వెంకటేశ్వర్‌రెడ్డి

అవినీతి నిర్మూలనే ఎన్ఎస్‌పీ లక్ష్యం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్16: రాష్ట్రంలో అవినీతి నిర్మూలనే ఎన్ఎస్‌పీ లక్ష్యమని నవ సోష లిజం పార్టీ లక్ష్యమని ఆ పార్టీ జాతీయ నాయకులు ఆనంద్ తెలియజేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేయడానికి తమ పార్టీ శాసనసభ అభ్యర్థులకు క్రికెట్ బ్యాట్, పార్లమెంట్ అభ్యర్థులకు డైమెండ్ గుర్తులు వచ్చాయన్నారు. తమకు పట్టున్న నియోజ కవర్గాల్లో త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

ప్రజా సంక్షేమం కోసమే ఐబీపీ

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్16: ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసం ఇండియన్ బిలీవర్స్ పార్టీ ఏర్పడిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సి.చంద్రన్ డేవిడ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళ వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ఏపీలో నూతనంగా ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. తిరుపతి ఎంపీగా తాను, గూడూరు ఎమ్మెల్యే స్థానానికి రమేష్ బాబు పోటీచేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు ఐజయ్య, డి.విల్సన్‌బాబు, ఆర్.లక్ష్మీపతి, ఎ.సగైయు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనం, పెన్షన్ రాకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియ జేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులకు కూడా కార్పొరేషన్ వేతనాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలకు చేతిలో చిల్లిగవ్వ లేక ఉద్యోగుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని వివరించారు. 24 గంటల్లోపు వేతనాలు ఇవ్వకపోతే ఓటు కోసం వచ్చే అధికార పార్టీ నాయకులను ఉద్యోగులు, పెన్షనర్లు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు : మల్లాది విష్ణు

తిరుపతి(నేరవిభాగం)ఏప్రిల్16:ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. తిరుపతిలో మంగళవారం మీడియాసమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019, 2024లో ఒక్క అసెంబ్లీ సీటూ బ్రాహ్మణులకు కేటాయించకపోవడం దారుణమన్నారు.

బీసీఈఎఫ్ కార్యాలయం ప్రారంభం



బీసీ ఎంప్లాయిస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 16: తిరుపతి జిల్లాలోని 34 మండలాల పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, టీటీడీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు, తిరుపతి పరిధిలోని ఏడు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న మొత్తం 18వేల బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం బీసీఈఎఫ్ కార్యాలయం ప్రారంభించినట్లు రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టా భాస్కర్‌యాదవ్, బీసీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, రామమోహన్, మధుసూదన్, శ్రీనివాసులు, శేఖర్‌బాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాటక దినోత్సవం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 16: తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నగరానికి చెందిన రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని సీనియర్ రంగస్థల కళాకారులు.. డి.మునికృష్ణారెడ్డి, ఆమూరు సుబ్రహ్మణ్యం, పూడి కేశవులు, ఎస్. వెంకటస్వామిలను కందుకూరి వీరేశలింగం అవార్డులతో నిర్వాహకులు సత్కరించారు. అంతకు ముందు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి గోపినాథరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పాటించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16: నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లుచేసి నిబంధనలు పాటించాలని అధికారులకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సార్వత్రిక ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. ఆయా నియోజకవర్గాలకు అందిన ఈవీఎంలు, ఇంటీరియం స్ట్రాంగ్‌రూమ్‌లో పూర్తిస్థాయి భద్రతలో ఉండాలన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధుల ఇళ్లకు బీఎల్‌వోలు, సెక్టోరల్ అధికారులు వెళ్లి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులు గురించి వివరించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఎన్నికల విధుల్లోని పోలింగ్ సిబ్బంది సంబంధిత ఏఈఆర్వోలకు తమ దరఖాస్తులను సమర్పించి ఆర్వో తెలియజేసిన తేదీన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మకు నిమ్మకాయల అలంకరణ



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 16: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మే 14వ తేదీ, తమిళ చిత్రినెల నాల్గవ మంగళవారం జాతర నిర్వహిస్తారు. ఇందులో భాగాంగా వైశాఖ మాసం మొదటి మంగళవారం ఏప్రిల్ 16వ తేదీ తొలి మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని పూర్తిగా నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ సేవలు

ఐదు రైళ్లకనుగుణంగా బస్సుల ఏర్పాటు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 16: తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ సేవలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించారు. తిరుపతి నుంచి తమిళనాడు వివిధ ప్రాంతాలకు రాకపోకలు జరిగే ఐదురైళ్ల సమయాలకనుగుణంగా తిరుమల, తిరుపతి, తిరుచానూరు, రేణిగుంట తదితర ప్రాంతాలకు బస్సులు నడవనున్నాయి. ఈ మేరకు నూతన సమయాలను మార్చుచేశారు. టిక్కెట్ బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ప్రతి బస్సు స్టేషన్ ముందు రిక్వస్ట్ స్టేజ్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఉదయం స్టేసన్‌ను సందర్శించిన ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి రద్దీకనుగుణంగా బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణీకులు ఈ మార్పులను గమనించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు బాలాజీ, హరిబాబు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



తిరుచానూరు రైల్వేస్టేషన్ ముందు ఆగివున్న ఆర్టీసీ బస్సులు

రైళ్ల రాకపోకలు వివరాలు..

- చెన్నై-తిరుపతి(16057) రైలు ఉదయం 9.25గంటలకు రానుంది. తిరుపతి-చెన్నై(16054)ఉదయం 10.10 గంటలకు బయల్దేరుతుంది.
- అరక్కోణం-తిరుపతి(06753) ఉదయం 11గంటలకు వస్తుంది. తిరుపతి-అర్కోణం(06728)మధ్యాహ్నం 1.30గంటలకు బయల్దేరుతుంది.
- విల్లుపురం-తిరుపతి(16854)ఉదయం 11.20గంటలకు రానుంది. తిరుపతి-విల్లుపురం(16853)మధ్యాహ్నం ఒంటిగంటకు బయల్దేరుతుంది.
- చెన్నై-తిరుపతి(06727) మధ్యాహ్నం 12.50గంటలకు రానుంది. తిరుపతి-అరక్కోణం(06754)మధ్యాహ్నం 3.45గంటలకు బయల్దేరుతుంది.
- చెన్నై-తిరుపతి(16053)సాయంత్రం 5.05గంటలకు రానుంది. తిరుపతి-చెన్నై(16058)సాయంత్రం 6 గంటలకు బయల్దేరుతుంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి


మృతిచెందిన రాజేష్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16: అనుమానాస్పద స్థితిలో రాజేష్(30) అనే కార్మికుడు మృతి చెందిన ఘటన నాయుడుపేట - చెన్నై రహదారి సమీపంలోని అన్నమేడు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం అరక్కోణంకు చెందిన రాజేష్ ఓజిలి మండలం పెద్దపరియ వద్ద ఉన్న ఓ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తోటి కార్మికులైన శశికుమార్, శీనుతో కలిసి అన్నమేడు క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లారు. అక్కడ ముగ్గురూ కలిసి మద్యం తాగారు. కొంత సమయం తరువాత అక్కడ నుంచి బయలుదేరారు. కొంత సేపటి తరువాత వస్తానని రాజేష్ చెప్పడంతో శశికుమార్, శీను వెళ్లిపోయారు. చీకటి పడినా రాజేష్ రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం పోలీసులు, కార్మికులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పరిశీలించగా నదిలో తేలుతున్న రాజేష్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ గోపీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

చిల్లకూరు, ఏప్రిల్ 16: చిల్లకూరు మండలంలోని గుత్తావారిపాళెం గ్రామ సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష పడినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని గుత్తావారిపాళెం సమీపంలోని నందన అగ్రిఫామ్ తోటలో రామసుబ్బయ్య(60) వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. అదేతోటలో బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య నాగమ్మ పనిలో చేరారు. కొంతకాలం తరువాత పని మానేసి వెళ్లిపోవాలని, లేకపోతే చంపుతానని రామసుబ్బయ్యను వెంకటేశ్వర్లు బెదిరించేవాడు. 13 జూలై 2021న రామసుబ్బయ్య రక్తపుమడుగులో పడి తీవ్రగాయాలతో పడి ఉండడాన్ని అదే తోటలో పనిచేస్తున్న ఆవుల కాపరైన బాలయ్య గమనించాడు. వెంటనే రామసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు సమాచారం అందించాడు. అలాగే 108 వాహనంలో రామసుబ్బయ్యను నెల్లూరుకు, అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రామసుబ్బయ్య మృతిచెందాడు. ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తోటలో పనిచేస్తున్న సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు విచారించిన గూడూరు కోర్టు ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి నిందితుడైన వెంకటేశ్వర్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

ఉరేసుకొని ప్రైవేట్ బస్సు డ్రైవర్ మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16: సూళ్లూరుపేటలోని ఝాన్సీనగర్‌లో కాపురం ఉంటున్న చేనిగుంట సతీష్(24) ఉరేసుకొని మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు... తమిళనాడు రెడ్‌హిల్స్‌కు చెందిన సతీష్ అదే ప్రాంతానికి చెందిన అశ్వినీని ప్రేమ వివాహం చేసుకొన్నాడు. రెండేళ్ల కిందట సూళ్లూరుపేటకు వచ్చి శ్రీసిటీలోని పరిశ్రమలకు వెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎస్ఐ రహీం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావిలో పడిపోయిన జింక
కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


జింకకు చికిత్స చేస్తున్న అటవీశాఖ, అగ్నిమాపక సిబ్బంది

కోట, ఏప్రిల్ 16: కోట మండలం చిట్టేడు వద్ద ఉన్ననేలబావిలో ఓ జింక ప్రమాదవశాత్తు పడిపోయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా అగ్నిమాపక సిబ్బంది ఆ జింకను కాపాడి ఊపిరిపోశారు. స్థానికుల కథనం మేరకు... చిట్టేడు, కేశవరం, అటవీప్రాంతాల నుంచి ఎండ తీవ్రతను తట్టుకోలేక దాహార్తిని తీర్చుకునేందుకు ఐదేళ్ల వయస్సు కలిగిన జింక చిట్టేడులో ఉన్న ఓ నేలబావి వద్దకు వచ్చింది. గట్టుపై నుంచి నీళ్ల తాగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికులు గుర్తించి కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి బావిలో నుంచి జింకను బయటకు తీసుకువచ్చి శస్త్రచికిత్స చేయించారు. అనంతరం జింక తేరుకోవడంతో కేశవరం అడవుల్లో వదిలిపెట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడి మృతి

బాలాయపల్లి, ఏప్రిల్ 16: గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన సంఘటన బాలాయపల్లి మండలంలోని పెరిమిడి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తొట్టంబేడు మండలం చిన్న కనపర్తి గ్రామానికి చెందిన పులి మస్తాన్(38) నాయుడుపేట మండలంలోని మేనకూరులోని వెస్టేజ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పెళ్లకూరు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం సొంత పని నిమిత్తం బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి వెళుతుండగా పెరిమిడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తలపై తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహబూబ్ సుభాని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసు నమోదు

తడ, ఏప్రిల్ 16: బాడుగకు కార్లు తీసుకొని ఉడాయించిన వ్యక్తిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వరదయపాళెం మండలం ఇరుగుళం గ్రామానికి చెందిన బాబు కార్లను అద్దెకు తీసుకొని శ్రీసిటీలోని పరిశ్రమలకు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో తడకు చెందిన గుణశేఖర్, అతని స్నేహితుల వద్ద ఉన్న మూడు కార్లను అద్దెకు తీసుకున్నాడు. రెండు నెలలపాటు అద్దె చెల్లించాడు. ఆ తరువాత కన్పించకుండా పరారయ్యాడు. అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా కడపలో ఆ కార్లను కుదవ పెట్టినట్లుగా గుర్తించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, ఏప్రిల్ 16: కోట క్రాస్‌రోడ్డులోని చల్లకాలువ సమీపంలో పది మద్యం బాటిళ్లను బెల్టు తరలిస్తున్న శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

చంద్రబాబుతోనే ప్రజా శ్రేయస్సు: నెలవల


ర్యాలీలో విజయశ్రీ, నెలవల, పరసా, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట, ఏప్రిల్ 16: చంద్రబాబు నాయుడుతోనే ప్రజా శ్రేయస్సు సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని విజయగణపతి దేవస్థానంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల జనసందోహంతో పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం మాట్లాడుతూ వైసీపీ పాలనలో కౌరవ సభగా మారిన అసెంబ్లీ గౌరవ సభగా చూడాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలని, ఇందుకోసం త్వరలో జరిగే ఎన్నిల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కోరారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీ, తిరుపతి ఎంపీగా వెలగపల్లి వరప్రసాదరావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ సంక్షేమం, అభివృద్ధి పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ పీఎంగా, రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉంటేనే ప్రగతి సాధ్యమన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అష్టకష్టాలు పడ్డారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగినేని కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జంపాల మాల్యాద్రి నాయుడు, మాజీ కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురాకుల సురేంద్రబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు ఉగుమూడి భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, గాలి రాజేష్‌నాయుడు, దార్ల రాజేంద్ర, ధనంజయరెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, నిత్యా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేద్దాం: వరప్రసాద్


బీజేపీ నాయకులతో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

తిరుపతి,(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 16: కేంద్రంలో మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు కోరారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి, నియోజకవర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షుల సమావేశం రాష్ట్ర ఎన్నికల కోఆర్డినేటర్ శేఖర్‌జీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి జరగాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, పామాంజి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, లీగల్‌సెల్ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రప్ప, వరప్రసాద్, నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, వినీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌ను ఆయన నివాసంలో వరప్రసాదరావు కలుసుకున్నారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు అందరూ సహకరించాలని కలసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను నియమించడం సంతోషకరమన్నారు.

వైసీపీ పతనం ఖాయమైంది

వెంకటగిరి: అరాచక వైసీపీ ప్రభుత్వం పతనం అంచున ఉందని, రాబోయేది ఉమ్మడి ఎన్డీఏ ప్రభుత్వమని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థుల సమన్వయ కమిటీ సమావేశం మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూత్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి ఆనం, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ, వరప్రసాదరావును సత్కరిస్తున్న నాయకులు

టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం: విజయశ్రీ

పెళ్లకూరు, ఏప్రిల్ 16: టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ అన్నారు. మండలంలోని రోసనూరు, కృష్ణప్పకండ్రిగ, బంగారంపేట, మోదుగులపాలెం, ఊడిపూడి తదితర గ్రామాల్లో మంగళవారం ఎన్డీఏ కూటమి నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని తెలిపారు. అప్పుడే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా రోసనూరు గ్రామంలో మిరప తోటలో పనిచేస్తున్న రైతులు, కూలీలతో విజయశ్రీ మాట్లాడారు. మిరప రైతుల సమస్యలు, గిట్టుబాటు ధరల గురించి ఆమె ఆరా తీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పూర్తి సబ్సిడీతో రుణాలను అందించడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత, నెల్లూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రంగినేని కృష్ణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, వట్టికుండల శేఖర్‌నాయుడు, కందమూడి శివకుమార్, దొమ్మరాజు సతనారాయణరాజు, చింతా సతీష్‌చంద్ర, దార్ల రాజేంద్ర, కేవీనాయుడు, నూతలపాటి ప్రసాద్‌నాయుడు, నర్రావుల మోహన్‌నాయుడు, వెంపళ్ల వెంకటేశ్వర్లు, దువ్వూరు కృష్ణయ్య, ఇరుగు వెంకటసుబ్బయ్య, నల్లు కస్తూరమ్మ, గంగాబత్తిన శివరామయ్య, పుట్టు, గురవయ్య, గుంటపూడి గురవయ్య, గోను ముత్యాలయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఎన్డీఏ కూటమి విజయం తథ్యం: జనసేన


ప్రచారంలో కూటమి నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 16: రానున్న ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం సాధించడం తథ్యమని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం గూడూరు మండలంలోని కాండ్ర గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, నవీన్‌రాజు, జగదీష్, మణి, మోహన్, భూపతి, శ్రీనాథ్, పెంచలయ్య, ప్రభాకర్, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి: పాశం


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 16: టీడీపీ అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఎస్ఆర్‌పీ సెంటర్ ప్రాంతంలో ఆయన సతీమణి సంధ్యారాణితో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులంటే సీఎం జగన్‌కు చిన్నచూపన్నారు. దళిత యువకులకు శిరోమండలం చేసిన కేసులో విశాఖ ఎస్సీ, ఎస్టీ సిటీ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. దళితులను అవమానించిన వారికి పదవులు ఇవ్వడం జగన్ పైశాచికానికి నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంతో పాటు ఐటీ రంగాన్ని అభివృద్ధిపరిచి ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రానికి, యువతకు భవిష్యత్తు ఉండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం ఏకమై వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించి ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, చాన్‌బాషా, కేశవ, ఉమాశంకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, గుండాల లీలావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకూ హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు

టీడీపీ అధికారంలోకి రాగానే ప్రైవేటు పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పరిధిలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. స్థానికంగా ఉండే వారిని ఎన్నుకుంటే నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. వలస పక్షులను నమ్మి మోసపోకుండా రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని సునీల్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణమనాయుడు, దశరధరామిరెడ్డి, చంద్రమోహన్, పవన్‌కుమార్, నవకోటినాయుడు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, చాన్‌బాషా, కేఆర్‌రెడ్డి, రూపవతి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అడుగంటిన అభివృద్ధి: పరసారత్నం

పెళ్లకూరు, ఏప్రిల్ 16: గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అడుగంటిదని, ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి పరసారత్నం విమర్శించారు. మంగళవారం ఆయన ఊడిపూడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత పాలనలో మండలంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. అన్ని గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులతో వాగులు, చెరువుల పూడికతీత, పేదలకు ఇళ్లు, నాణ్యమైన రోడ్లు తదితర మౌలిక సదుపాయలను కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు సమసిపోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని.. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రంగినేని కృష్ణయ్య మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. కార్యక్రమంలో వేలూరు హరినాయుడు, సిద్దులయ్య నాయుడు, గుంటమడుగు సుగుణమ్మ, పాలచ్చూరు సుబ్బరామయ్య, అక్కరపల్లి మాధవరెడ్డి, మరుపూరు మస్తాన్‌రెడ్డి, తాళ్ల యుగంధర్, నెలవల ప్రసాద్‌యాదవ్, గంగాబత్తిన రామకృష్ణ, గురవయ్య, పునబాక పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని ఉత్తమ నెల్లూరు వద్ద మోటారు బైక్, ఐస్‌క్రీమ్ విక్రయించే వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. కోటకు చెందిన రమణయ్య చింతవరంలోని పశువుల ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు మోటారు బైక్‌లో వెళ్తుండగా ఉత్తమ నెల్లూరు వద్ద ఐస్ విక్రయించే వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదవంలో రమణయ్య గాయపడడంతో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెక్‌పోస్టులో ఎస్ఈబీ తనిఖీలు

తడ, ఏప్రిల్ 16: ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ అరుణ్‌కుమార్ తడ మండలంలోని బీవీపాళెం చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. అక్కడ నుంచి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈబీ ఎఈఎస్‌లు నరసింహరావు, రమేష్ తదితరులు ఉన్నారు.

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కోట, ఏప్రిల్ 16: వైసీపీ వైఫల్యాలను గడప గడపకు తీసుకువెళ్లి ఓటర్లను చైతన్యపరచాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తీగల సురేష్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పాదర్తి కోటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జరుగుమల్లిలో మంగళవారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలన్నదే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఆ దిశగా ముందుకుసాగాలని బీసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కందల బాలకృష్ణయాదవ్, చాపల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పెళ్లకూరు, ఏప్రిల్ 16: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ ఐరన్ పరిశ్రమలో గాయపడిన కార్మికుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బీహార్‌కు చెందిన పరమేశ్వర్ కుమార్(28) ఈనెల 13న పెన్నేపల్లి ఐరన్ పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఐరన్ లిక్విడ్ మెటల్ బ్లాస్ట్ అవడంతో ప్రమాదానికి గురయ్యాడు. తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

అదుపుతప్పి మినీ లారీ బోల్తా

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16: నాయుడుపేట - మేనకూరు వెళ్లే స్వర్ణముఖి బ్రిడ్జిపై మినీలారీ అదుపుతప్పి నదిలో బోల్తా పడింది. మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారం నుంచి మెటీరియల్ తీసుకువచ్చేందుకు మంగళవారం నాయుడుపేట నుంచి మినీలారీ బయలుదేరింది. స్వర్ణముఖి బ్రిడ్జిపై వెళ్తుండగా అదుపుతప్పి నదిలో పడిపోయింది. లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితులంటే జగన్‌కు చిన్నచూపు: ఆదిమూలం


టీడీపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 16: జగన్‌కు దళితులంటే చిన్నచూపని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. మంగళవారం మండలంలోని హరి ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ శిరోమండనం కేసులో వైసీపీ ఎమ్మెల్సీ త్రిమూర్తులకు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక ప్రత్యేక కోర్టు 18 నెలలు జైలు శిక్ష, రూ2 లక్షల జరిమానా విధించడం సబబేనని అన్నారు. వైసీపీ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, చేశారు. తాను కూడా వైసీపీలో ఎన్నో అవమానాలకు గురైనట్లు తెలిపారు. రాష్ట్రంలోని దళితులందరూ వైసీపీకి బుద్ధి చెప్పి ఇంటికి పంపించి, టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. మండలంలోని బొప్పరాజపాలెం ఎంపీటీసీ ధనలక్ష్మితో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర భవిత కోసం సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, రమేష్, బాలరాజు, బొప్పరాజుపాలెం పంచాయితీ సర్పంచ్ రమేష్ బాబు, మాజీ సర్పంచ్ ఆనందయ్య, మధు, గాండ్ల గోవింద శెట్టి, దొరవేలు రెడ్డి, మాణిక్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

హంస వాహనంపై అగస్తీశ్వరస్వామి



నారాయణవనం, ఏప్రిల్ 16: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్తీశ్వర స్వామిని మంగళవారం రాత్రి హంస వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర్‌ప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని హంస వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారథి, సూపరిటెండెంట్ ధర్మయ్య, అర్జితం అదికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తడుకులో సీతారాముల కల్యాణం

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 16: మండలంలోని తడుకు పంచాయతీ తిమ్మరాజుకండ్రిగలో వెలసిన సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, నిత్య పూజా కైంకర్యాలు నిర్వహిస్తార చెప్పారు.

సైకిల్‌కే ఓటేస్తాం.. సమస్యలు పరిష్కరించండి
ఏకాంబరకుప్పం మహిళలు


ఏకాంబరకుప్పంలో ప్రచారం చేస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 16: గత ఎన్నికల్లో వైసీపీకి ఓటేసి తప్పుచేశాం.. ఈసారి సైకిల్‌కే ఓటేస్తాం.. మా సమస్యలు పరిష్కరించండని నగరి పట్టణంలోని ఏకాంబరకుప్పంలోని ప్రకాష్‌నగర్ మహిళలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను కోరారు. మంగళవారం ఏకాంబరకుప్పంలో ఆయన సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింట పంపిణీ చేస్తూ, సంక్షేమపథకాల గురించి వివరించారు. నగరి అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు తపన అని భానుప్రకాష్ పేర్కొన్నారు. చేనేతరంగం, మరమగ్గాలు, రైతులు, మహిళలు, పెన్షన్‌లు, ఇతర సంక్షేమ పథకాలను టీడీపీ పక్కాగా అమలుచేస్తుందని తెలిపారు. డ్వాక్రా గ్రూపులను ప్రవేశపెట్టిందే చంద్రబాబు అని, మహిళల సంక్షేమం తాము మరిచేదే లేదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, మాణిక్యవాసన్, కేకే శ్రీకాంత్, రజనీకాంత్, ఇలంగోవన్, తనిగవాసన్, తులసిలింగం, మురళీ, వరదన్, దయాలన్, గుణశేఖర్, జ్యోతి నాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎంపురంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి

వడమాలపేట, ఏప్రిల్ 16: అప్పుల భారాన్ని మోస్తున్న రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు కోరారు. మంగళవారం ఏఎం పురం పంచాయతీలో మీకోసం... మీభాను కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు జానా వెంకటయ్య, మణిరాజు, లక్ష్మీప్రసన్న, లోకరాజు, హేమావతి, రామచంద్రరాజు, హరి, సాంబయ్య, రాజయ్య, అనిల్, రవీంద్ర, దాము, బంగారయ్య, రవినాయుడు, కోటిరాజు, గుణ, పెద్దబ్బరాజు, శేషాద్రి యాదవ్, సుబ్రమణ్యం రెడ్డి, మునిశేఖర్, వెంకటేశ్వర రావ్, మునిశేఖర్, గిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

స్ట్రాంగ్‌రూంకు చేరిన ఈవీఎంలు



స్ట్రాంగ్ రూంలో భద్రపరచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

సత్యవేడు, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రి మంగళవారం నియోజకవర్గానికి చేరాయి. రేణిగుంట ఈవీఎం గోదాము నుంచి భద్రత నడుమ వచ్చిన ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లను నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు, పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్‌వో రామాంజనేయులు ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో భద్ర పరిచారు. ఈ కార్యక్రమంలో సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, టీడీపీ, బీజేపీ, వైసీపీ, సీపీఎం నాయకులు దిలీప్, మునిప్రతాప్, శ్యాంప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్‌ఫైర్‌పై అవగాహణ కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తొట్టంబేడు, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి అగ్నిమాపక అధికారి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని చెంచులక్ష్మీ కాలనీలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, ఆయిల్ మిస్‌ఫైర్ అయినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రవీణ్

తొట్టంబేడు, ఏప్రిల్ 16: మండలంలోని వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థికసంఘం నిధులను తాగునీటి పంపులు, బోరుమోటర్ల రిపేర్లకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తరుణాక్షి రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయతీ ఏఈ, సెక్రరటరీలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న రామాంజులనాయుడు

కేవీబీపురం, ఏప్రిల్ 16: బీసీలకు న్యాయం జరగాలన్నా , అభివృద్ధి జరగాలన్న టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు చెప్పారు. మంగళవారం ఎగువపూడి గ్రామంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తరపున పోటీ చేస్తున్న ఆదిమూలాన్ని గెలిపించి టీడీపీ ప్రభుత్వానికి అఖండ మెజార్టీని చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, సురేష్ రెడ్డి, సాధు, వెంకటేష్, శోభన్‌బాబు, నాగరాజురెడ్డి, స్టాలిన్, బాలకృష్ణం రాజు, చంద్రశేఖర్ రాజు, లోకనాథం నాయుడు, లక్ష్మీపతిరాజు, చిన్నపరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలాన్ని భారీ మెజారిటీతో గెలిపించండి

● పార్టీ శ్రేణులకు అమర్ దిశా నిర్దేశం



అమరనాథరెడ్డిని కలసిన పిచ్చాటూరు టీడీపీ శ్రేణులు

పిచ్చాటూరు, ఏప్రిల్ 16: ఉమ్మడి అభ్యర్థి కోనేటి ఆదిమూలాన్ని భారీ మెజారిటీతో గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలని అమర్‌నాథ్ రెడ్డి సత్యవేడు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులకు ఆదేశాలు ఇచ్చారు. మంగళవారం పలమనేరులో అమర్‌నాథ్ రెడ్డిని కలిసినా పార్టీ శ్రేణులకు ఆయన ఈ మేరకు దిశా నిర్దేశం చేశారు. ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండే ఆదిమూలం లాంటి వ్యక్తిని అసెంబ్లీకి పంపిస్తే సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని తెలిపారు.

మద్యం అమ్ముతున్న ఒకరి అరెస్టు

తొట్టంబేడు, ఏప్రిల్ 16: శ్రీకాళహస్తి మండలంలోని కెవీరాపురం గ్రామంలో ఇంటి వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న తంగవేలును అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ తెలిపారు. అతని వద్ద 20మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వేపోలీసులు

తొట్టంబేడు, ఏప్రిల్ 16: శ్రీకాళహస్తి మండలంలోని ల్యాంకో కంపెనీ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు స్థానిక కర్మాగారాలలో పని చేసే ఉత్తరాదికి చెందిన వ్యక్తిగా రైల్వే పోలీసులు బావిస్తున్నారు. మృతుడి చాతీపై పచ్చబొట్టు హిందీలో ఉంది. అతను తెలుపు, నలుపురంగు గీతల హాఫ్‌షర్టు, నలుపురంగు ప్యాంట్ దరించి ఉన్నాడు. ఆతడి శరీరం రెండు బాగాలుగా తెగిపడడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వేపోలీసులు తెలిపారు,

ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి

కేవీబీపురం, ఏప్రిల్ 16: మండలంలోని కోవనూరు మలుపు వద్ద సోమవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని పీవీ కండ్రిగ గిరిజన కాలనీకి చెందిన మారయ్య(19) అనే యువకుడు మృతి చెందాడు.. ఏఎస్ఐ లోకనాథం కథనం మేరకు... సోమవరం రాత్రి మారయ్య పాతపాళెంలో ఓ కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళుతుండగా కోవనూరు మలుపు వద్ద శ్రీకాళహస్తి నుంచి కేవీబీపురం వైపు వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన మారయ్యను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని.. ఆటో డ్రైవర్ కోసం వెతుకుతున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మారయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంరతం బంధువులకు అప్పగించారు.

9మంది వలంటీర్లు రాజీనామా

తొట్టంబేడు, ఏప్రిల్ 16: మండలంలోని గుండేలిగుంట సచివాలయ పరిదిలోని చోడవరం వాలంటీర్లు ఇద్దరు, కాసరం గ్రామంలోని ఏడుగురు వలంటీర్లు మంగళవారం రాజీనామ చేశారు. రాజీనాయాలను ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక వలంటీర్లుగా రాజీనామా చేస్తున్నామన్నారు.

పలు ఆలయాల్లో విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తికి అభిషేకానంతరం అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపా లు వెలిగించి హారతులు పట్టారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.



హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్

కాలభైరవుడి ప్రాకారోత్సవం...

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. కాలభైరవ స్వామికి అభిషేకాలు, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.

ఉమ్మడి ప్రభుత్వంలోనే ప్రశాంతత: సుధీర్



15వ వార్డులో టీ తాగుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి



ఏర్పేడులో ప్రచారం చేస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16: ఉమ్మడి ప్రభుత్వంతోనే శ్రీకాళహస్తిలో ప్రశాంతమైన వాతావరణం తిరిగి తెచ్చుకోగలమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం 15,16 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ నడిబొడ్డు ప్రాంతం కావడంతో వ్యాపారులు, స్థానికులు బ్రహ్మరథం పట్టారు. మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి తరహాలో శ్రీకాళహస్తిలో రౌడీయిజాన్ని రూపుమాపాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రౌడీయిజంపై ఉక్కు పాదం మోపుతామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కూడలిలో సుధీర్ రెడ్డి అందరితో పాటు టీ తాగి సందడి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయ్ కుమార్ కంటా రమేష్, జనసేన నాయకులు కొట్టే సాయి మహేష్ కుమార్, బీజేపీ నాయకులు అమర్‌నాథ్ డిల్లీ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శ్రీకాళహస్తి పట్టణంలోని 15 వార్డులో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసం రమేష్ తమ నాయకుడికి వినూత్నంగా స్వాగతం పలికారు. సుధీర్ ఫొటోలతో కూడిన దండ చేయించి క్రేన్ సాయంతో వేయించారు.

వైసీపీని తరిమికొట్టండి

ఏర్పేడు, ఏప్రిల్ 16: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏర్పేడులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి, నాయకులు గురవారెడ్డి, పొన్నారావు,. పేరం దనంజయల నాయుడు, నాగరాజునాయుడు, కృష్ణవేణి, నిరంజన్, బాలాజీయాదవ్, మురళీయాదవ్, గోల్డ్‌మాన్ నాయుడు, శ్రీనివాసులు యాదవ్, నరసింహులు యాదవ్, రాఘవేంద్రరావు, చంద్రశేఖర్‌నాయుడు,రాజకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సుధీర్ ఫొటోలతో కూడిన గజమాలతో స్వాగతం పలుకుతున్న కాసం రమేష్, కార్యకర్తలు

చంద్రబాబుతోనే బీసీల అభ్యున్నతి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డివారి గురవారెడ్డి

ఏర్పేడు, ఏప్రిల్ 16: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే బీసీలు అన్ని విధాల అభివృద్ధి చెందారని ఆ పార్టీరాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మంలం సరస్వతికండ్రిగ గ్రామంలో మంగళవారం బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీలు ఏకమై చంద్రబాబును గెలిపించాలని కోరారు. బీసీ నేతలు సామా అంకయ్య, కుమార్, గణేష్‌నాయుడు, గుణయాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు



పెళ్లి మండపం వద్ద స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16: శ్రీకాళహస్తిలోని పెళ్లి మండపం కూడలి వద్ద మంగళవారం ట్రాఫిక్ టిక్కెట్లు చోటుచేసుకున్నాయి. నెహ్రూ వీధిలో సీతారాముల కల్యాణోత్సవం పురస్కరించుకుని పందిళ్లు ఏర్పాటు చేశారు. దాంతో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు. అయితే ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో వాహదారులకు అవస్థలు తప్పలేదని వాపోయారు.

వాహనాల తనిఖీ



కేవీబీపురం, ఏప్రిల్ 16: ఎన్నికల దృష్ట్యా పోలీసులు మండలంలో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, తమిళనాడు రిజిస్ట్రేషన్ వాహనాలను మండల కేంద్రంలోని ఆస్పత్రి వద్ద, రాజులకండ్రిగ, పీవీకండ్రిగ తదితర ప్రాంతాల్లో ఎస్ఐ నజీరుద్దీన్, ఏఎస్ఐ లోకనాథం, సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం





వేడుకకు ముస్తాబైన పట్టాభిరామాలయం - రామ మందిరాలకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: సీతారాముల కల్యాణం సందర్భంగా శ్రీకాళహస్తిలో ప్రత్యేక శోభ సంతరించుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నెహ్రూ వీధిలో వెలసిన పట్టాభిరామ స్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి పురస్కరించుకుని బుధవారం కల్యాణం జరుగనుంది. ఇందుకోసం ఆలయంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేవారు. నెహ్రూ వీధిలో పందిళ్ల ఏర్పాటు చేశారు. ఏర్పాటు పనులను మంగళవారం రాత్రి ఈవో నాగేశ్వరరావు పరిశీలించారు. ఇక పట్టణంలో ఉన్న రామ మందిరాలకు ఈవో లాంచనంగా పట్టు వస్త్రాలను అందజేశారు.



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో నాగేశ్వరరావు

రంగయ్యగుంటకు చేరిన అయోధ్య ప్రచార వాహనం



కేవీబీపురం, ఏప్రిల్ 16: ఆయోధ్య రామ ప్రచార వాహనం సీతారాములచిత్రపటాలతో మండలంలోని రంగయ్యగుంటకు మంగళవారం చేరుకుంది. భక్తులు వాహనంలో స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రచార వాహనం సూరమాల, అంజూరు, గుంటిపేడు గ్రామాల గుండా పయనించి శ్రీకాళహస్తి చేరుకుందని నిర్వాహకులు తెలిపారు.

ఉమ్మడి అభ్యర్థుల గెలుపు భావితరాలకు భవిష్యత్తు



ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 16: ఉమ్మడి అభ్యర్థుల గెలుపు భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని జనసేన నాయకులు అన్నారు. మండలంలోని తొండూరు పంచాయతీ, శ్రీహరి కోటకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిపార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలంను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లావణ్యకుమార్, చిరంజీవియాదవ్, కులశేఖర్‌రెడ్డి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిక ఆదేశాల మేరకు మండంలోని చిన్నపాండూరు అరుంధతి వాడలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాగిపట్టు రామవయ్య మాదిగ, దొరబాబు మాదిగ, బాలకుమార్, భరత్, శివయ్య, సుబ్బయ్యచందు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం వార్డు సభ్యుల ఆగ్రహం

పంచాయతీ కార్యాలయంలో రచ్చరచ్చ - తమ బిల్లులు ఇవ్వకుండా సర్పంచ్‌కు ఎలా ఇస్తారని నిలదీత



వార్డు సభ్యులకు సర్దిచెబుతున్న ఈవోపీఆర్డీ రత్నప్రభ

రేణిగుంట, ఏప్రిల్ 16: తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయకుండా సర్పంచ్ చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఎలా మంజూరు చేస్తారంటూ వార్డు సభ్యులు ఈవోను నిలదీశిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పంచాయతీలో నీటి సరఫరా సరిగా లేకపోయినా, చెత్తకుప్పలు పేరుకుపోయినా, వీధి కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నా... ఎవరూ ఏం అయితే మాకేమి అన్న చందంగా ఉన్న వార్డు సభ్యుల వ్యవహార శైలి మరోమారు రోడ్డెక్కింది. మంగళవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లు రచ్చ రచ్చ చేయడం ప్రజా సంక్షేమం పట్ల వీరికున్న బాధ్యత ఎంతో అర్థమవుతోంది. వివరాల్లోకి వెళ్తే... రేణిగుంట పంచాయతీ పరిధిలోని వార్డు మెంబర్లు కాలువ, సీసీ రోడ్లు ఇలా వివిధ రకాల పనులను సొంత నిధులతో చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ బిల్లుల బకాయిలు చెల్లించలేదు. మరోపక్క సర్పంచ్ నగేష్ మాత్రం తాను చేయించుకున్న పనులకు బిల్లు మంజూరు చేయించు కున్నారు. ఇది తెలుసుకున్న వార్డుమెంబర్లు పంచాయతీ కార్యాలయంలో ఈవో రవిశంకర్‌రెడ్డిని, సర్పంచ్‌ను నిలదీశారు. అదే సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఇతర అవసరాలకు వచ్చిన స్థానికులు ఇక్కడ జరిగే గొడవను చూసి ముక్కున వేలేసుకున్నారు. ఈ గొడవ జరుగుతుండగా ఈవో పీఆర్డీ రత్నప్రభ పంచాయతీ కార్యాలయానికి చేరుకునివార్డు సభ్యులతో మాట్లాడారు. పంచాయతీలో జరిగిన పనులకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ ముగిసిన తరవాత అందరికీ బిల్లులు చెల్లింపు జరుగుతుందని ఆమె సర్దిచెప్పారు.